పంపిణీకి విద్యాకానుక కిట్లు సిద్ధం

- పాఠశాల ప్రారంభం రోజే పంపిణీకి ఏర్పాట్లు
- మండల కేంద్రం నుంచి పాఠశాలలకు అందజేత



విద్యా కానుక కిట్లును మండల కేంద్రం నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్న ఉపాధ్యాయులు



ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలు

గురజాల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాలలకు చేరుకుంటున్నాయి. విద్యా కానుక కిట్లను గత రెండు రోజులుగా మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి అధికారులు వివిధ పాఠశాలలకు చేరవేసే పనిలో ఉన్నారు. మండల కేంద్రాలకు చేరుకున్న విద్యా కానుక కిట్లను అధికారులు పరిశీలించి పాఠశాలలకు ఆటోల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. పాఠశాలలు తెరిచే నెల రోజులు ముందుగానే జగనన్న విద్యా కానుకలు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు బూట్లు, బెల్ట్, రెండు జతల చొప్పున యూనిఫాం డిక్షనరీలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ విద్యా కానుకలను ఈనెల 12వ తేదీ పాఠశాలలు తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

4873 మంది విద్యార్థులకు ....

గురజాల మడలంలోని 81 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మొత్తం 4873 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారి అందరికి జగనన్న విద్యా కానుక కిట్లు అందించడం జరుగుతుంది. ప్రతి పాఠశాలలకు జగనన్న విద్యా కానుకలు పంపిణీలో సీఆర్పీలు నిమగ్నమయ్యారు. జగనన్న విద్యా కానుక కిట్లతో పాటుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్నారు.

మొదటి రోజే పంపిణీ....

వేసవి సెలవులు అనంతరం ఈ నెల 12వ తేదీనా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. తెరిచిన మొదటి రోజు నుంచే విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాం. ఇప్పటికే పాఠశాలలకు పుస్తకాలు, విద్యా కానుక కిట్లు సరఫరా చేయడం జరిగింది. మండల కేంద్రం నుంచి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసాం. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అన్ని విద్యార్థులకు సరిపడా రావడం జరిగింది.

– ఇన్‌చార్జి ఎంఈఓ శనగవరపు వెంకట ప్రసాద్

ముస్లింల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యం



కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : ముస్లింల అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా అన్నారు. నగర పంచాయతీలోని నూర్ మసీద్‌లో శనివారం హర్ దిల్ మే వైఎస్సార్ హామ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌భాషా మాట్లాడుతూ.. ముస్లింల అభ్యున్నతికి ఆలోచించే ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి అభివృద్ధికి బాటలు వేశారని, తండ్రి బాటలోనే తనయుడు సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ముస్లింలు వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు ముస్లింలు ముందు వరుసలో ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని ముస్లింలు కూడా గమనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో షేక్ గన్నుబుడే, షేక్ జమాల్ సైదా, షేక్ నాగుల్‌మీరా, షేక్ రఫీ, షేక్ సత్తార్ పాల్గొన్నారు.

వైభవంగా దేవస్థానం 13వ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో ప్రసన్నాంజనేయ స్వామి

రెంటాల(రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం 13వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ప్రసన్నాంజనేయ స్వామివార్ల కల్యాణమహోత్సవాన్ని కమనీయంగా...రమనీయంగా ఎంతో వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఎస్. గోపాలాచార్యులు నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు కనుల పండుగగా నిర్వహించిన స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వందలాది మంది భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దేవస్థానం కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.

వీరుల గుడి పునఃనిర్మాణానికి శంకుస్థాపన



వీరుల గుడి పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: సనాతన ధర్మం కోసం మన పూర్వీకులు నిర్మించిన పురాతన గుడులను పర్యవేక్షించుకోవడంలో మనందరం భాగస్వాములు అవుదామని ప్రభుత విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో నూతనంగా పునఃనిర్మాణం చేపట్టనున్న కొలుపుల వీరుల అమ్మవారి గుడికి భూమి పూజ నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ళ క్రితం మన పెద్దలు నిర్మించిన పురాతన గుడులను సంరక్షించుకోవాలని వారి గుడి నిర్మాణంలో ఎన్నో సాంప్రదాయాలు, సంస్కృతులు భావితరాలకు తెలియజేసేలా, వాటిని పరిరక్షించుకోవాలని కోరారు. గుడి నిర్మాణానికి రూ. 5 లక్షల నిధులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మరుమాముల శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకకిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు దస్తగిరి, మాచర్ల ఏసోబు, ముదిశెట్టి శ్రీను, నాయకులు మారం వాసు, కాయితి వెంకటరెడ్డి, రంగా సత్యనారాయణ, నట్టువ శ్రీనివాసరావు, నట్టువ రాధాకృష్ణ, దాసరి కేశవ తదితరులున్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు


గురజాల : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కో ఆప్షన్ సభ్యుడు పీర్ అహ్మద్ అన్నారు. స్థానిక గ్రంథాలయ శాఖలో వేసవి శిక్షణ శిబిరాలల్లో భాగంగా చిన్నారులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు వృథా కాకుండా చూడాలనే ఆలోచనతో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ, 14వ వార్డు కౌన్సిలర్ బండి రవికుమార్, గ్రంథాలయ శాఖాధికారిణి హిమభార్గవి, తదితరులున్నారు.

ఐదు పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీ

వారి స్థానంలో నూతన హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరణ

రొంపిచర్ల: మండలంలోని ఐదు జిల్లా పరిషత్‌ల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు బదిలీ కాగా, ఆ స్థానాల్లో నూతనంగా ప్రధానోపాధ్యాయులు శనివారం బాధ్యతలను స్వీకరించారు. రొంపిచర్ల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న షేక్ మొహిద్దీన్‌సాహెబ్ బదిలీకాగా, ఆ స్థానంలో పాలపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సుభాని నియమితులయ్యారు. అలాగే సంతగుడిపాడు హెచ్‌ఎం పి.జ్యోతిర్మయి బదిలీకాగా, ఆ స్థానంలో శావల్యాపురం మండలం సందెపూడి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. అలాగే రెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మాధవీలత బదిలీకాగా ఆ స్థానంలో పుసులూరు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. అలాగే కొత్తపల్లి పాఠశాల హెచ్‌ఎం బి.మల్లికార్జునరావు స్థానంలో పెదనందిపాడు మండలం ఉప్పలపాడు జెడ్పీపాఠశాల హెచ్‌ఎం టి.మాధవి బాధ్యతలు స్వీకరించారు. గోగులపాడు జెడ్పీహెచ్‌ఎం పి.అన్నపూర్ణ స్థానంలో నరసరావుపేట మండలం యల్లమంద హెచ్‌ఎంగా పనిచేస్తున్న హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

దొండపాడులో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



దొండపాడులో ప్రతిష్ఠించిన 30 అడుగుల భారీ అభయాంజనే స్వామి విగ్రహం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో 30 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భారీ క్రేన్ సాయంతో ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రతిష్ఠలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మద్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ పేరం రాజానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నపురెడ్డి శివారెడ్డి, నవులూరి రామిరెడ్డి, పుట్లూరి రామకోటిరెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూతన దేవాలయాల ప్రతిష్ట



శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో నూతన దేవాలయాలు విజయ గణపతి, మహాశీతలి, బొడ్రాయి, గమిడిశీతలి, పోలేరమ్మ తల్లి, పోతురాజు, వీరబ్రహ్మేంద్రస్వాముల, నీలంపాటి అమ్మవారి దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ఉదయం 7.35 నిమిషాలకు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివార్లను దర్శించుకున్న వారిలో సర్పంచ్ తిరివిధి శివకుమారి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు బొల్లా గిరి బాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వైస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, తిరివిధి రమణారావు, శ్రీనివాసరావు, చినకంచర్ల గ్రామసర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, మండల కోఆర్డినేటరు పాపసాని సురేష్, గ్రామస్తులు పాల్గొన్నగా భారీ అన్నదానం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేస్తున్న డీబీఆర్‌సీ నేతలు

రాజుపాలెం: బడి ఈడు పిల్లలకు విద్యాబుద్దులు నేర్పించినప్పుడే మన జీవితాల్లో వారు వెలుగులు నింపుతారని డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. మండలంలోని బలిజేపల్లి గ్రామంలో బడి మానివేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ అధిక శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులే బడి మానేస్తున్నారని, తల్లిదండ్రులు శ్రద్ధ వహించి బడికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు వలస కూలీలకు వెళ్లినప్పుడు మాత్రమే ఇలా బడులు మానేస్తున్నారని అలాంటప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతున్న సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలలను వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు డి.మనోహర్‌చిన్న మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాలు, వాటితోపాటు తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు జమ చేస్తున్నారని చెప్పారు. అందు వల్ల ఎస్సీ, ఎస్టీలకు చెందిన పిల్లలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలకలు, బలపాలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ రిసోర్స్ కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాన పంటకు ముందు నవధాన్య సాగుతో జీవం



రైతులకు నవధాన్య కిట్టు పంపిణీ చేస్తున్న ప్రకృతి ప్రాజెక్టు అధికారులు

రాజుపాలెం: ప్రధాన పంటలో సాగుకు ముందే నవధాన్యాల పంటలు సాగు చేయడంతో భూమికి కావాల్సిన పోషకాలు అధికంగా లభ్యమవుతాయని ప్రాజెక్టు యూనిట్ ఇన్‌చార్జి టి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి ఆదేశాలమేరకు రైతులకు నవధాన్యాల విత్తనాలు కలిగిన బ్యాగ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పు ధాన్యం, పెసర, మినుము, అలసందలు, శనగ, చిరుధాన్య పంట రకాలైన కొర్ర, రాగి, సజ్జ, సామలు, ఊదలు, ఒరిగలు, నూనెజాతి రకాలైన మొక్కజొన్న, గోధుములతో పాటు, కూరగాయలు, ఆకుకూరలు వంటి 30 రకాల పంటలను స్థాన పంటకు ముందు సాగు చేయడం వలన భూమిలో జోవవైద్య పెరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల రైతులు 13 కిలోల నవధాన్యాల విత్తనాలను 70 కోట్లను తయారు చేసి రైతులకు అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు కె.సునీత, తిరుపతమ్మ, యలమందమ్మ, నాగజ్యోతి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు



రాజుపాలెం: ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదరు గాల్పులకు మండలంలోని పలు గ్రామాల్లో, పొలాల్లో విద్యుత్ స్తంబాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారంలు పడిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లినట్లు ఏఈ ప్రసాద్ శనివారం తెలిపారు. పడిపోయిన, ఇరిగిపోయిన స్తంబాల స్థానాల్లో కొత్త స్తంబాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫారంలు పూర్తిగా దెబ్బతినడంతో కొత్త ట్రాన్స్‌ఫారంలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలో రాజుపాలెం, కొత్తూరు, గణపవరం, బలిజేపల్లి, రామిరెడ్డిపేట తదితర గ్రామాల్లోని పొలాల్లో సుమారు 20 పోల్స్ పడిపోయాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టామని ఏఈ తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ



రెంటచింతల: స్థానిక వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాలలో శంకర్ కంటి ఆస్పత్రి పెదకాకాని వారి ఆధర్యంలో 22 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు, మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు గుండా జనార్ధన్‌రావు శనివారం తెలిపారు. ఏప్రిల్ 30న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 350 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 222 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని విడతల వారిగా శంకర కంటి ఆస్పత్రికి తీసుకు వెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయడంతోపాటు భోజన సదుపాయం కూడా కల్పించడం జరిగిందన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్లు ఆకాంక్ష, సోనాలి, సిబ్బంది సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నాళం పెదబాబు, యేచూరి వెంకటసైదయ్య, ఎక్కల రవి, రాజేష్, సత్యనారాయణ, కాశీ రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి

దాచేపల్లి : రైలు కిందపడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. నడికుడి రైల్వే జంక్షన్ సమీపంలోని బి క్యాబిన్ వద్ద సూమారుగా 35 సంవత్సరాల వయస్సున వివాహిత మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. శరీర భాగాలు ముక్కలు ముక్కలైయ్యాయి. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు పసుపు, ఆకుపచ్చ చీరె, ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉన్నది.

ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరం



శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామం ఎస్టీ కాలనీలో ఉచితంగా టైఫాయిడ్ టీకా శిబిరం దాతల సహకారంతో నిర్వహించినట్లు బొల్లాపల్లి మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజరు, వివేకానంద యూత్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈశిబిరాన్ని ప్రముఖ గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత వేల్పూరు వాసి మొగలి సుభాష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆరోగ్య సూపర్‌వైజరు మాట్లాడుతూ 0–2 నుంచి 40 సంవత్సరాల లోపు వారంతా టీకా వేయించుకోవచ్చునని, ఒక డోసు టీకా వేయించుకున్న వారికి మూడు సంవత్సరాల వ్యాధి రాదని వివరించారు. ఈటీకా సురక్షతమైనదనీ, ఎటువంటి సైడు ఎఫెక్ట్స్ లేవన్నారు. టైఫాయిడ్ జ్వరం కలుషితమైన నీరు, ఆహారంలో ఈగలు, క్రిముల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.పరమేశ్వర రావు, సురేష్, గోపీ కాలనీయూత్ తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య తిరుపతమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ట



అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణీట్రస్టు ద్వారా నిర్మించే నూతన దేవాలయాల నిర్మాణంలో బాగంగా మండల పరిదిలోని అత్తలూరులో నిర్మించిన తిరుపతమ్మ దేవాలయంలో గోపయ్య తిరుపతమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల తిరు పతి దేవస్థానం, సమరసతసేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళూరి విష్ణు మాట్లాడుతూ టీటీడీ ద్వారా తొలివిడత హరిజన, గిరిజన, మత్స్యకార కాలనీల్లో 502 దేవాలయాలు నిర్మించి ప్రతిష్ట కార్య క్రమాలు నిర్వహించామన్నారు. అలాగే రెండవ వి డత 320 దేవాలయాలు నిర్మాణం చేస్తున్నామన్నా రు. అలాగే ప్రతి దేవాలయం వద్ద బాలవికాసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అలాగే వారం వారం భజనాకార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతినెలలో పౌర్ణమి నాడు సామూహిక హరతి, నెలకోకసారి నగర సంకీర్తన నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. హిందూ సంస్కృతిని సంప్రదాయాలను ప్రచారం చేయడానికి టీటీడీ సమరసతసేవా ఫౌండేషన్ నిరంతర కృషి చేస్తుందన్నారు. తొలుత రూ.10 లక్షలరూపాయ ల నిధులతో నిర్మించిన దేవాలయంలో తిరుపతమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ఠానంతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లాకన్వీనర్ విజయభాస్కర్,, జిల్లా దేవాలయాల ఇన్‌చార్జి కోమటి సాంబశివరావు, సంస్థ స్థానిక ప్రతినిధి కోయ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అత్తలూరు తదితర గ్రామాల ప్రజలు భారీగా నూతనంగా ప్రతిష్ఠించబడిన తిరుపతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కంటి వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు శంకర్ కంటి వైద్యులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా గుంటూరులో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ వైద్యశిబిరం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుందని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గురజాల: నగరపంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు మండపం వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెళ్లి కుమార్తె వయస్సు మైనార్టీ తీరనందున బాల్య వివాహం వల్ల కలిగే నష్టం, అనర్థాల గురించి పెద్దలకు, తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఎస్సైలు అనంతకృష్ణ, అశోక్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శరమాళ్ల శివ మృతి

గురజాల : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శరమాళ్ల శివ శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు.గత ఎన్నికల్లో శరమాళ్ల శివ వైఎస్సార్ సీపీ గెలుపుకు తన వంతు కృషి చేశారు. శరమాళ్ల శివ మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), కె రవిశంకర్‌లతో పాటుగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పలు పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

బాలికా సదనంలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడుగురాళ్లలో నిర్వహిస్తున్న బాలికా సదనంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు బాలికా సదనం నిర్వాహకులు తెలియజేశారు. అనాథ, పాక్షిక అనాధ(తల్లిదడ్రులలో ఒకరు మాత్రమే ఉన్న వారు), దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారి బాలికలకు, జవానుల కుటుంబాల నుండి వచ్చిన బాలికలకు (1 నుంచి 5వ గరగతి వరకు) వసతి గృహంలో వసతి, ఉచిత భోజనం సదుపాయం కల్పించటం జరుగుతుందని వారు తెలియజేశారు. బాలికా సదనం నందలి 4వ తరగతి విద్యార్థినులకు గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలకు 5వ తరగతి విద్యార్థినులకు ఆదర్శ పాఠశాల/ జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు పరత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల బాలికలు, తల్లిదండ్రులు, సంరక్షకులు వివరాలకు : 8096063456 నెంబర్‌ను సంప్రదించాలని వారు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న మధు

దాచేపల్లి : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దాచేపల్లిలో శనివారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన తురుమెళ్ల మధు(42) తన ఇంట్లోనే చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మధు భార్య గౌతమికి అనారోగ్యంబారిన పడడంతో వైద్య ఖర్చుల నిమిత్తం అప్పలు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చలేక మానసిక ఆందోళనతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తెలు నిఖిల(14) రంజని(12) ఉన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో గాయత్రి హోమం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల (ఇంగ్లీషు మీడియం) పునఃప్రారంభోత్సవం సందర్భంగా శనివారం శ్రీ గాయత్రి హోమము నిర్వహించారు. రాష్ట్ర సరస్వతీ విద్యా పీఠం, విద్యాభారతి సంఘటనా కార్యదర్శి కన్నా భాస్కర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో విలువలతో కూడిన విద్యతో పాటు మన సనాతన సంస్కృతి, సాంప్రదాయాలు విద్యార్థులకు నేర్పుతారన్నారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, కార్యదర్శి చలువాది చినసత్యనారాయణ, ప్రబంధ కారిణి కార్యదర్శి సీహెచ్.గోపికృష్ణ, విభాగ్ కార్యదర్శి అబ్బూరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కట్టా శంకరరావు, ప్రధాన మాతాజీ మన్నవ ధనలక్ష్మి, కమిటి సభ్యులు దేవరశెట్టి రవికుమార్, చల్లా రత్తయ్య, హరికుమార్, ఆచార్యులు, మాతాజీలు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.